క్లుప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

అడవులదీవి ఎస్ఐ బాబూరావు



నిజాంపట్నం: పరిసరాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అడవులదీవి ఎస్ఐ బాబూరావు తెలిపారు. మండలంలోని అడవులదీవి గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో సోమవారం నిర్వహిస్తున్న పిచ్చిచెట్ల తొలగింపు కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించి అనంతరం మాట్లాడారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల సమస్య పొంచి ఉన్నందున తమ గృహాన్ని మాత్రమే కాకుండా పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. తేమ వాతావరణం లేకుండా పర్యవేక్షించుకుంటుండటంతో పాటు వారంలో ఒక రోజు డ్రై డేని పాటించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ శివారులో రహదారికి ఇరువైపులా కమ్మేసి ప్రజారవాణాకు ఆటంకం కలిగిస్తున్న పిచ్చిచెట్ల తొలగింపు పనులను ఆయన దగ్గరుండి చేయించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రేపు భవిత స్కూల్‌లో మెడికల్ క్యాంప్

రేపల్లె: పట్టణంలోని భవిత స్కూలులో ఈ నెల 30వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అలెంకో సంస్థ వారిచే మెడికల్ అసెస్‌మెంట్ క్యాంప్ నిర్వహించబడునని భవిత స్కూల్ స్పెషల్ ఎడ్యుకేటర్ ఎన్.అనురాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంప్‌లో 18 సంవత్సరాలలోపు దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉపకరణాలు అందించటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లోని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంప్‌కు హాజరయ్యే దివ్యాంగులు ఆధార్, సదరన్, రేషన్ కార్డు జిరాక్స్‌లతో పాటు రెండు పాస్‌పోర్ట్ ఫొటోలు తెచ్చుకోవాలన్నారు. పూర్తి వివరాలకై భవిత స్కూల్‌లో గాని, 8309341418 నంబరును గాని సంప్రదించాలన్నారు.

ప్లాస్టిక్ రహిత బాపట్లగా తీర్చిదిద్దేందుకు చర్యలు

కమిషనర్ జి.రఘునాథరెడ్డి



బాపట్ల అర్బన్: ప్లాస్టిక్ రహిత బాపట్లగా తీర్చిదిద్దేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం ఆకస్మికంగా దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశాల మేరకు నిత్యం షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలు కూడా ప్లాస్టిక్ నియంత్రించేందుకు సహకరించాలని సూచించారు. సోమవారం 1.50 టన్నుల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ తనిఖీల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సయ్యద్ నజీర్, సీహెచ్ కరుణ ఉన్నారు.

ఘనంగా గోదాదేవి జన్మదినోత్సవం



తెనాలి: పట్టణ గంగానమ్మపేటలోని కమిషన్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి బాలస్వామీజీ ఆధ్వర్యంలో అర్ధ చాతుర్మాస వ్రతదీక్షా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 19వ రోజైన సోమవారం గోదాదేవి పుట్టినరోజు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా జరిగాయి. హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. తుళ్లూరు నుంచి శ్రీకృష్ణాశ్రమం శ్రీస్కంధ దేవానందగిరి స్వామివారు, గోదాదేవికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. కార్యక్రమంలో నంబూరు వెంకట కృష్ణమూర్తి, రావూరి సుబ్బారావు, ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, రాజేశ్వరావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

ఇటు వ్యథ... అటు వృథా

- నిర్లక్ష్యం నీడలో ఇరిగేషన్ కాలువలు
- పీటీ చానల్‌కు సరిపడా నీరు అందని వైనం
- డీజిల్ ఇంజన్లతో రైతులకు తప్పని అగచాట్లు
- వెస్ట్ బాపట్ల చానల్ నుంచి డ్రైన్‌లోకి కృష్ణా జలాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పీటీ చానల్ పరిధిలో డీజిల్ ఇంజన్లతో పొలాలను తడుపుకుంటున్న రైతులు



వెస్ట్ బాపట్ల చానల్‌కు నీటిని వదిలిన అధికారులు



నీరు లేక అడుగంటిపోతున్న పీటీ చానల్

బాపట్లటౌన్: అధికారుల అలసత్వం... పాలకుల నిర్లక్ష్యం వెరశి బాపట్ల నియోజకవర్గంలో రైతుల పాలిట శాపంగా మారింది. రైతుల కష్టాలు, బాధలు అర్థం చేసుకొని వారికేమి కావాలో, వారి అవసరాలు ఏంటో కూడా తెలుసుకోలేని స్థితిలో ఉంది కూటమి సర్కార్. ఇరిగేషన్ పరిధిలో ఉన్న కాలువలకు సక్రమంగా నీటిని సరఫరా చేయకపోవడంతో క్లైదుటే ఎండిపోతున్న పైర్లను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. పీటీ చానల్ పరిధిలో ఓ వైపు నీరులేక రైతులు డీజిల్ ఇంజన్లు, పైపుల సాయంతో నీటిని తోడుకుంటూ అష్టకష్టాలు పడుతుంటే నీటి అవసరం లేకపోయినా వెస్ట్ బాపట్ల చానల్‌కు నీటిని విడుదల చేసి వృథాగా పేరలి డ్రైన్‌కు వదులుతున్నారు. పీటీ చానల్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో రైతులకు చుక్కనీరు అందకపోవడంతో తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. అధికారులు రైతులకు నీటిని సరఫరా చేసేందుకు చొరవచూపుతున్న దాఖలాలు లేవు.

రెండు మండలాలకు జీవనాడి పీటీ చానల్

బాపట్ల, కర్లపాలెం మండలాల్లోని సుమారు 28 వేల ఎకరాలకు సాగునీటిని అందించే కాలువే పేర్లి తిమ్మరాజు (పీటీ) చానల్. ఈ కాలువ పరిధిలో బాపట్ల మండలంలోని మూలపాలెం, నందిరాజుతోట, హైదరపేట, వెస్ట్ పిన్నిబోయినవారిపాలెం, ఈస్ట్ పిన్నిబోయినవారిపాలెం, వల్లువారిపాలెం, మచ్చావారిపాలెం, చింతావారిపాలెం, ముత్తాయపాలెం, కొండుబోట్లవారిపాలెం, కర్లపాలెం మండలంలోని సమ్మెటవారిపాలెం, శీలంవారిపాలెం, పేరలి, తుమ్మలపల్లి, పెదగొల్లపాలెం, పేరలిపాడు, పెదపులుగువారిపాలెం, గణపవరం, కర్లపాలెం, చింతాయపాలెం, నక్కలవారిపాలెం, నల్లమోతువారిపాలెం, కొత్త నందాయపాలెం, పాత నందాయపాలెం, నర్రావారిపాలెం, మర్రికట్ట, కట్టావాదపరిధిలోని పొలాలకు సాగునీటిని అందించాల్సి ఉంది.

చివరి భూములకు అందని నీరు

గడిచిన కొద్ది రోజులుగా వరుణుడు మొహం చాటేయటంతోపాటు భానుడు భగభగ మండిపోతుండటంతో కాలువల ద్వారా సరఫరా అయ్యే నీరు శివారు ప్రాంతాల్లోని ఆయకట్టు చివరి భూములకు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు అవసరం లేకపోయినప్పటికీ బాపట్ల మండలంలోని వెస్ట్ బాపట్ల చానల్ నీటిని సుబ్బారెడ్డిపాలెం సమీపంలో గేట్లు ఎత్తి వృథాగా పేరలి డ్రైన్‌కు వదులుతున్నారు. దీంతో రైతులు అధికారులు, పాలకుల తీరుపై ఆగ్రహంతో రగిలిపోతున్నారు. పీటీ చానల్ పరిధిలో తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటుంటే నీటిని సక్రమంగా సరఫరా చేయకపోగా అవసరం లేనిచోట నీటిని వృథాగా మురుగు కాలువలకు వదలటం ఏంటంటూ పాలకుల తీరుపై మండిపడుతున్నారు.

జాడలేని లస్కర్లు

ఇరిగేషన్ పరిధిలో కాలువల ద్వారా సరఫరా చేసే సాగునీటిని శివారు ప్రాంతాల్లోని ఆయకట్టు భూములకు సరఫరా చేయాల్సిన బాధ్యత ఇరిగేషన్ అధికారులపై ఉంటుంది. ఇరిగేషన్ డీఈఈ, జేఈఈ, ఏఈఈ లతోపాటు ఒక్కో ఏఈ కింద ఆయా ప్రాంతాల్లోని ఆయకట్టు విస్తీర్ణాన్ని బట్టి లస్కర్లను నియమిస్తారు. ఒక్క పీటీ చానల్ పరిధిలో ఏఈఈతోపాటు 15 మంది లస్కర్లు ఉండాల్సి ఉండగా ఒక్క లస్కర్ కూడా అందుబాటులో లేరు. లస్కర్లు నిత్యం కాలువపై తిరుగుతూ నీటి అవసరం ఉన్న ప్రాంతాల్లోనే నీటిని విడుదల చేస్తూ అవసరం లేని ప్రాంతాల్లో నిలుపుదల చేసి ఎగువ ప్రాంతాల్లోని భూములకు నీటిని అందిస్తుంటారు. లస్కర్లు లేకపోవడంతో అవసరం ఉన్నా లేకున్నా తూములను తీసి కాలువ మొదట్లోని రైతులు నీటిని వృథా చేస్తున్నారు. దీంతో ఆయకట్టు శివారు ప్రాంతాల్లోని రైతులు తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు.

పార్టీలో యువత పాత్ర కీలకం

వైఎస్సార్‌సీపీ బాపట్ల సమన్వయకర్త కోన రఘుపతి



బాపట్ల: వైఎస్సార్‌సీపీలో యువత పాత్ర కీలకంగా ఉంటుందని పార్టీ సమన్వయకర్త కోన రఘుపతి పేర్కొన్నారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య ఆధ్వర్యంలో పీవీపాలెం మండలం యువజన విభాగం నూతన కమిటీ ఎంపిక సోమవారం చేపట్టారు. యువజన విభాగం మండల అధ్యక్షుడిగా మౌలాలిని నియమించారు. ఈ సందర్భంగా కోన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఉయ్యూరు లీలాశ్రీనివాసరెడ్డి, పార్టీ యువజన విభాగంలో నత్తల కృపాసుమాన్, షేక్ సిలార్, సయ్యద్, అన్వర్, అజిత్‌కుమార్, సీహెచ్ కాటూరి మణికంత, కుక్కల అరవింద్‌రెడ్డి, అన్నం గోపిరెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చుండూరు(వేమూరు): చినపరిమి గ్రామంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీరు దోనేపూడి అర్జునరావు తెలిపారు. చుండూరు మండలంలోని మండూరు, ఆలపాడు, కారుమూరు పాలెం, చినగాదెలవర్రు, పెదగాదెలవర్రు గ్రామాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

కాలర్ పట్టుకోం... మర్యాదపూర్వకంగా అడుగుతున్నాం

మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి



చినపరిమిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం



వేమూరు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

బాపట్ల: ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే కాలర్ పట్టుకొని నిలదీయండంటూ.. లోకేష్‌బాబు ఒక పక్కన.. మరోపక్కన మీకు రూ.18వేలు.. మీకు..రూ.10 వేలు అని చెప్పిన చంద్రబాబు అబద్ధాలను నిలదీద్దాం .. అంటూ మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని 6, 7, 8 వార్డుల పరిధిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఉప్పరపాలెంలో రచ్చబండ నిర్వహించారు. ప్రజలు భారీగా పాల్గొన్నారు. చంద్రబాబు అధికారంలోకి రావటానికి ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, ప్రజలకు సంక్షేమ ఫలాలు అందేలా చూసేందుకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే సంక్షేమం.. అభివృద్ధి రెండు కళ్లుగా పాలన కొనసాగిందని వివరించారు. ప్రతి ఇంటికి సంక్షేమం అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ఉన్న పథకాలను ఒక్కొక్కటిగా తొలగించుకుంటూపోతున్నారని దుయ్యబట్టారు. ఏడాదికి పైగా పాలనలో ఒక్క పింఛన్ ఇచ్చిన దాఖలాలు లేకపోగా ఉన్న పింఛన్లు తొలగించేందుకు సర్వేలు నిర్వహిస్తున్నారని అన్నారు. ఒక పక్కన ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులు.. మరోపక్కన ఎటువంటి సంక్షేమ ఫలాలు రాక అక్కచెల్లెమ్మలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని, అధైర్యపడొద్దని సూచించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకా వంద పనులు చేసుకుందామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, మున్సిపల్ మాజీ ప్రతిపక్షనేత షేక్ సయ్యద్‌పీర్, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, నర్రావుల వెంకట్రావు, పీటా బాబు, జోగి రాజా తదితరులు ఉన్నారు.

చుండూరులో...

చుండూరు(వేమూరు): కూటమి ప్రభుత్వం మహిళలను పూర్తిగా మోసం చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ మేరుగ సుభాషిణి అన్నారు. చుండూరు మండలంలోని చినపరిమి గ్రామంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ప్రతి నెల రూ.1,500 ఇస్తామని, ఏడాది గడిచినా మహిళలకు వేయలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 45 నుంచి 60 సంవత్సరాల లోపు మహిళలకు ప్రతి ఏడాది రూ.18 వేలు ఇవ్వడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని, కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయకుండా అమలు చేయడం జరిగిందని చెప్పడం సిగ్గుచేటని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో తమ్మా పాముల రెడ్డి, టి.బసివి రెడ్డి, ఉప సర్పంచ్ సాయిబాబా రెడ్డి, డి.సుధాకర్ రెడ్డి, అవుతూ బ్రహ్మారెడ్డి, వి.శివా రెడ్డి, రమణా రెడ్డి, షేక్ హుస్సేన్, వి.జ్యోతి, పి.వంశీ, జి.మోహన్ రెడ్డి, రాజేష్ కుమార్, ఎం.శివమ్మ, షేక్ నన్నేబీ, చొప్పర సుబ్బారావు, పి.శ్రీను, ఆటో శ్రీను పాల్గొన్నారు.

వేమూరులో...

వేమూరు: కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల గురించి పట్టించుకోక పోవడంతో రైతులకు పూర్తిగా నష్టం జరిగిందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోగంటి లవకుమార్ తెలిపారు. వేమూరులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిలో ప్రజలను చేసిన మోసాలు గురించి వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు పూర్తిగా అమలు చేయడం వల్ల ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు నమ్మి ప్రజలు ఓట్లు వేస్తే ప్రజలను పూర్తిగా మోసం చేయడం జరిగిందన్నారు. మరలా జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చే వరకు ప్రతి ఒక్కరూ పార్టీ కోసం పని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దాది సుబ్బారావు, గుమ్మడి దానియేలు, దున్నా మేరీ సుబాబు, తలతోటి జిగిన్‌బాబు, గాలి సుబ్బారావు, తలతోటి సురేష్, తలతోటి ఉదయ్, దర్శి శ్రీకాంత్, అమర్తలూరు వెంకయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు



అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మహమ్మద్ హుస్సేన్

రేపల్లె: ప్రజలు తమ సమస్యలను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీల రూపంలో అందించి పరిష్కరించుకోవచ్చని ఆర్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మహమ్మద్ హుస్సేన్ చెప్పారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి మాట్లాడారు. బేతపూడి శివారులోని ఉయ్యూరువారిపాలెం పంట కాల్వలో పూడిక తీయించాలని ఆ ప్రాంత రైతులు అర్జీ చేసుకున్నారన్నారు. చికెన్ షాపు వ్యర్థాలతో అనారోగ్య సమస్యలు పొంచి ఉన్నాయని తన ఇంటి పక్కనే ఉన్న చికెన్ దుకాణాన్ని తొలగించాలని రేపల్లె నుంచి చెరుకూరి సాంబోస్ ఫిర్యాదు చేశాడన్నారు. రేషన్ కార్డుకై చోడాయపాలెం నుంచి నలిగల సాల్మన్‌రాజు దరఖాస్తు చేసుకున్నాడని చెప్పారు. ఆర్ అండ్ బీ రోడ్డు పక్కనే ఉన్న ఆక్రమణలు తొలగించాలని కోరుతూ భట్టిప్రోలు మండలం పెదలంక గ్రామానికి చెందిన నన్నేపాముల నాగేశ్వరరావు, వెల్లటూరు గ్రామంలో చేతి పంపు మరమ్మతుల సమస్యపై ఆ గ్రామ నివాసి సైకం వెంకట సుబ్బారావు, జంపని గ్రామంలో తనకు చెందిన 50 సెంట్ల భూమిని సర్వే చేయించి హద్దులు చూపాలని అమృతలూరు మండలం ఎడమూరు గ్రామానికి చెందిన ఉప్పాల వీరులు అర్జీలు ఇచ్చారన్నారు. సమస్యలను పరిశీలించి ఆయా శాఖల అధికారుల ద్వారా పరిష్కరించబడునని చెప్పారు.

నూతన గ్రామ కమిటీ నియామకం



పోతుమర్రు నూతన గ్రామ కమిటీతో వరికూటి అశోక్‌బాబు

వేమూరు: బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ గురించి ప్రతి కుటుంబానికి తెలియజేసేందుకు గ్రామ కమిటీ పూర్తి బాధ్యత తీసుకోవాలని నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. వేమూరు నియోజకవర్గంలో పోతుమర్రు గ్రామ నూతన కమిటీని సోమవారం ఏర్పాటు చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కల్లేవరపు ఏసుదాసును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల ద్వారా అన్ని వర్గాలకు చెందిన ప్రజలను మోసం చేయడం జరిగిందన్నారు. ముఖ్యంగా మహిళలను మోసం చేయడం జరిగిందని ఆయన చెప్పారు. మంగళవారం నుంచి గ్రామ కమిటీ సభ్యులు బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ప్రతి గడపకు తీసుకెళ్లాలన్నారు. పోతుమర్రు గ్రామంలో వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు తదితరులకు 70 మందికి పింఛన్లు వస్తున్నాయని, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయినా ఇంతవరకు కొత్త పింఛన్లు మంజూరు చేయలేదన్నారు. వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో దాది సుబ్బారావు, కోగంటి లవకుమార్, ఈపూరు కుసుమాబాబురావు, కమిటీ సభ్యులు ఈపూరు ధర్మారావు, అత్తోట బాబురావు, పోట్లేల వెంకటశ్వరరావు, వల్లూరు వెంకట నరేంద్ర, అత్తోట జగదీష్, తెనాలి జక్రయ్య పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుమూడి-కొల్లూరు కరకట్ట రహదారి అభివృద్ధి చేయాలి


జైభీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రాంజీ



సీనియర్ అసిస్టెంట్ మహమ్మద్ హుస్సేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న జైభీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాంజీ

రేపల్లె: పెనుమూడి నుంచి కొల్లూరు వరకు కృష్ణా కరకట్ట రహదారిని అభివృద్ధి చేసి ప్రజా రవాణాకు అందుబాటులోకి తీసుకురావాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ అన్నారు. రహదారి అభివృద్ధి సమస్యపై ఆర్డీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ మహమ్మద్ హుస్సేన్‌కు సోమవారం ఆయన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రహదారి నిర్మాణంలో అడ్డంకులను తొలగించేందుకు పాలకులు, అధికారులు దృష్టి సారించాలన్నారు. పెనుమూడి నుంచి తాడేపల్లి వారిధి వరకు కృష్ణానది కరకట్ట రహదారి నిర్మాణం జరిగి 15 సంవత్సరాలు గడిచినప్పటికీ పెనుమూడి నుంచి కొల్లూరు వరకు పూర్తి స్థాయిలో రహదారి నిర్మాణం జరగలేదన్నారు. పెనుమూడి వారధి నుంచి రావి అనంతరం మధ్య కిలోమీటర్, పెదపులివర్రు నుంచి దోనేపూడి వరకు, కొల్లూరు లాకుల నుంచి కిలోమీటర్ దూరం వరకు రహదారి నిర్మాణంలో రైతుల నుంచి అడ్డంకులు ఏర్పడడంతో నేటి వరకూ సమస్యను పరిష్కరించి కరకట్ట రహదారిని ప్రజా రవాణాకు పూర్తిస్థాయి వినియోగంలోకి తీసుకురావడంలో సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడం శోచనీయమన్నారు. కేవలం కృష్ణా నది వరద ముంపుకు గురవుతున్న సమయంలో కరకట్టకు తాత్కాలికంగా మట్టిని మెరక చేస్తున్నారే తప్ప శాశ్వత పరిష్కారంపై ఆలోచన చేయకపోవడం అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. రేపల్లె, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల గ్రామాలను వరద ముంపుకు గురికాకుండా అరికట్టడంలో కరకట్ట రహదారి కీలకమయినదని, తీర ప్రాంత ప్రజలు రాజధాని అమరావతికి తక్కువ సమయంలో చేరుకోవడానికి మార్గం సుగమమవుతుందని తెలిపారు. సంబంధిత అధికారులు సత్వరమే నిర్మాణంలో ఉన్న అడ్డంకులను తొలగించి కరకట్ట రహదారిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జైభీమ్ రావ్ భారత్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పోతార్లంక శివ వెంకటేశ్వరరావు, రేపల్లె మండలం కన్వీనర్ కర్రా బాబురావు, మండే యాకోబు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలి



తెనాలిఅర్బన్: దోమల పుట్టకను నియంత్రించేందుకు గంబూసియా చేపలు దోహదపడతాయని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ ముప్పా యేసుబాబు పేర్కొన్నారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో పట్టణంలోని పలు కాల్వల్లో గంబూసియా చేపలను సోమవారం వేశారు. ఆయన మాట్లాడుతూ గంబూసియా చేపలను కాల్వల్లో వేయడం వలన దోమలను రోజుకు 180 నుంచి 300 లార్వాలను ఆహారంగా తీసుకుంటాయని చెప్పారు. చేపలు 6 నెలల నుంచి 3 సంవత్సరాలు బ్రతికి ఉంటాయని, 42 డిగ్రీల ఉష్ణోగ్రతను తట్టుకుంటాయని అన్నారు. తెనాలి పట్టణ సబ్‌యూనిట్ మలేరియా అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలోఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మౌళి, రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, దాసరి శివనాగమల్లేశ్వరరావు, తిరువీధుల శివరామ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.